RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 294 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | శనివారం 12 - 9 - 2026 | పేజీలు : 4 | వెల : రూ. 1 - 00

### ఇందిరమ్మ రాజ్యం.. భూరాక్షసుల స్వర్ణయుగం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 11: కేసీఆర్ పాలనలో ప్రజల సంపద పెరిగితే.. ఇందిరమ్మ రాజ్యంలో సామాన్యుల ఆస్తులు కాంగ్రెస్ కబంధహస్తాల్లో చిక్కుకున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గాంధీల పాలనలో గజానికో గజదొంగ తయారయ్యార న్నారు. సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి భూ దోపిడీకి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో16 లక్షల ఎకరాలు మాత్రమే 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉంటే.. ఇప్పుడు కాంగ్రెస్ హయాంలో కోటి16 లక్షల ఎకరాలకు చేరుకున్నాయని కేటీఆర్ వెల్లడించారు.

### కడియం, మంత్రులపై అక్బరుద్దీన్ సెటైర్లు..

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఒవైసీ, ప్యానెల్ స్పీకర్ కడియం శ్రీహరి మధ్య ఆసక్తికర వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి. అక్బరుద్దీన్ వరుసగా 20కి పైగా ప్రశ్నలు అడగడంపై కడియం శ్రీహరి అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. దీంతో, అక్బరుద్దీన్.. మంత్రులపై సెటైర్లు వేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా..'క్వశ్చన్ అవర్‌లో ఇన్ని ప్రశ్నలు అడగడం ఏంటి? 20కి పైగా ప్రశ్నలు అడిగితే ఏ మంత్రి ఏ సమాచారాన్ని చెప్పాలి?' అంటూ కడియం శ్రీహరి అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్బరుద్దీన్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. అనంతరం, అక్బరుద్దీన్..'మంత్రులు చాలా గొప్ప గొప్ప చదువులు చదివారు..

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ..

## తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ

**హైదరాబాద్,సెప్టెంబర్,11:** రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మళ్లీ న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసినపర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే, మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతులు పూర్తి లోపభుయిష్టంగా ఉన్నాయి పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కి.మీ ఉంటే.. కేవలం 20 కి.మీ మేర మాత్రమే స్టడీ చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే రీజియన్‌లో మృగవాణి నేషనల్ పార్క్ కూడా ఉందని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రతివాదిగా తెలంగాణ ప్రభుత్వం.. అయితే, పిటిషనర్ల అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్‌కు వెంటనే అందజేయాలని పేర్కొన్నది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఓ




పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేయగా తాజా పిటిషన్‌తో మరోసారి ప్రభుత్వానికి నోటీసులు రావడం ప్రధాన్యతను సంతరించుకుంది.

విచారణ వచ్చే నెల వాయిదా.. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16 కు వాయిదా వేసింది. ఈ క్రమంలోనే ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు అత్యంత కీలకం కానున్నాయి. అయితే, మూసీ ప్రక్షాళనను మొదటి నుంచి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండా.. తాజాగా మరోసారి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో సదరు ప్రాజెక్టుపై పిటిషన్ దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.

## భూభాగోతాలు బయటపడతాయనే భయంతో మమ్మల్ని సస్పెండ్ చేశారు

### హారతి కర్పూరంలా భూములు కాజేస్తుండు.. సీఎంపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

**హైదరాబాద్,సెప్టెంబర్,11:**తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భూములను సీఎం రేవంత్ రెడ్డి హారతి కర్పూలంలో కాజేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఇవాళ 22ఎ నిషేధిత భూములపై తెలంగాణ భవన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శాసనసభలో ప్రజ సమస్యలపై మాట్లాడనివ్వకుండా తమ పార్టీ ఎమ్మెల్యేలను మెడ పట్టి గెంటేశారని ఫైర్ అయ్యారు. సీఎం బాగోతాలు బయటపడతాయనే భయంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ల్యాండ్ చోరీ విపరీతంగా జరుగుతోందని, ఇందిరమ్మ రాజ్యంలో భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు..బీఆర్ఎస్ హయాంలో 22ఏ కింద కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని కోటి 16 లక్షల ఎకరాలకు పెంచారని కేటీఆర్ ఆరోపించారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని




సముద్రలింగాపురం ఊర్లో 800 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. సీఎం బ్రదర్స్ భూములను కొల్లగొడుతున్నారని, మంత్రుల ముఠా 'అలీ బాబా అరడజన్ దొంగల్లా' తయారైందని ఆరోపించారు. మంత్రుల వాటాల వివాదంలో భాగంగానే మంత్రి పదవి నుంచి ఒకరిని బర్తరఫ్ చేశారని పేర్కొన్నారు.

## కాంగోలో ఘోర అగ్నిప్రమాదం..

## 26 మంది విద్యార్థులు మృతి

కాంగోలోని బుకావు నగరంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 26 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయినవారిలో 19మంది బాలికలు, ఏడుగురు బాలురు ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బుకావు నగరంలోని ఓ ఇంట్లో మొదట మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే ఆ మంటలు సమీప ప్రాంతాలకు వ్యాపించాయి. మంటలు వ్యాపిస్తూ పక్కనే ఉన్న రెండు పాఠశాలలకు సైతం అంటుకున్నాయి. స్కూల్‌లో విద్యార్థులు ఉన్న సమయంలో మంటలు అంటుకోవడంతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. 26 మంది అక్కడిక్కడే మరణించగా పదుల సంఖ్యలో విద్యార్థులు గాయడ్డారు. సమాచారం అందడంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు మొదలుపెట్టారు. గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. అగ్రిప్రమాదం ఎలా జరిగింది? మంటలు వేగంగా పాఠశాలకు ఎలా వ్యాపించాయి అనే అంశాలపై అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు.



## భారీ బొగ్గు కుంభకోణం..


## హైదరాబాద్‌లో ఈడీ సోదాల కలకలం



**హైదరాబాద్,సెప్టెంబర్,11:**కోల్‌కతాలో నమోదైన భారీ బొగ్గు కుంభకోణంకేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దేశవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్ నగరంలోనూ ఈడీ సోదాలు కలకలం రేపుతున్నాయి.నగరంలోని ప్రముఖ ఏఎంఆర్ సంస్థ కార్యాలయాలు, సంబంధిత వ్యక్తుల నివాసాలలో ఈడీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపూట్టారు. బొగ్గు గనుల మైనింగ్, ప్రాజెక్టులకు సంబంధించి ఈ సోదాలు కొనసాగుతున్నట్లుగా తెలుస్తోంది. కేవలం హైదరాబాద్ లోనే కాకుండా,ఈ కుంభకోణానికి సంబంధించి ఢిల్లీ, కోల్‌కతా, జార్ఖండ్ రాష్ట్రాల్లోనూ ఈడీ అధికారులు మెరుపు సోదాలు నిర్వహిస్తున్నారు. బొగ్గు సిండికేట్, అక్రమ లావాదేవీలు, నిధుల మళ్లింపు కోణంలో ఈ తనిఖీలు సాగుతున్నట్లుగా సమాచారం. కాగా, పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్–అసన్సోల్ ప్రాంతంలో జరిగిన భారీ స్థాయి అక్రమ కోలరీ మైనింగ్, రవాణా, వసూళ్ల కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కీలక చర్యలు తీసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి ప్రత్యేక కోర్టులో ఐదుగురు నిందితులపై ఈడీ ఇప్పటికే ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ప్రధానంగా అరెస్టయిన చిన్మయ్ మోండల్, కిరణ్ ఖాన్‌లతో పాటు మరో ముగ్గురి పేర్లను ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. జార్ఖండ్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు అక్రమంగా కోలరీ బొగ్గును తరలించడంతో పాటు, చెల్లుబాటు అయ్యే డెలివరీ ఆర్డర్ (డిఓ) హోల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్ల నుంచి గుండా ట్యాక్స్, జీటీ, రంగదారి ట్యాక్స్ పేరిట సిండికేట్ భారీగా వసూళ్లకు పాల్పడింది. ఈ దందాల ద్వారా గత ఐదేళ్లలో రూ.650 కోట్లకు పైగా నేరపూరిత ఆదాయం సమకూరినట్లు ఈడీ గుర్తించింది. ఇక బొగ్గు అక్రమ రవాణా ఆటకం లేకుండా రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరు అధికారులకు, స్థానిక రాజకీయ ప్రముఖులకు పెద్దఎత్తున లంచాలు ముట్టినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## తుపాకుల మిస్సింగ్ కేసులో ట్విస్ట్..

## అచ్చంపేటలో మాజీ ఆర్మీ ఉద్యోగి అదుపులోకి?



అచ్చంపేట: హైదరాబాద్‌లోని మిలిటరీ ఆయుధ కార్యాలయంలో తుపాకులు మిస్సింగ్ అయిన ఘటనకు సంబంధించి ఉన్నత స్థాయి పోలీస్ యంత్రాంగం లోతైన దర్యాప్తు చేపడుతున్న నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో కలకలం నెలకొంది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నారనే ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులను అచ్చంపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. పదరా మండలం ఉడిమిళ్ల గ్రామంలో ఓ ఆర్మీ ఉద్యోగి ఉన్నట్లు పోలీస్ ఇంటెలిజెన్స్ గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఆ గ్రామానికి ఆర్మీ బలగాలు వెళ్లినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. సదరు వ్యక్తి వద్ద ఏకే రకం తుపాకులు ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. దీనిపై అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు. ఇదిలా ఉండగా.. ఆర్మీలో ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాజు అలియాస్ మల్లేష్ అనే వ్యక్తిని అచ్చంపేట పట్టణంలోని సాయినగర్ కాలనీలో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈయనతో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

అయితే ఈ విషయాన్ని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. ఈ ప్రచారంపై స్పష్టత కోసం 'దిశ' ప్రతినిధి అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాస్, సీఐ నాగరాజును ఫోన్ ద్వారా సంప్రదించారు. అచ్చంపేటలో ఇలాంటి ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని వారు తెలిపారు. ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని స్పష్టం చేశారు. అయితే ప్రచారంలో పేర్కొంటున్న ఘటన తెలంగాణలోని నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేటకు సంబంధించినది కాకుండా.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా అచ్చంపేట ప్రాంతానికి సంబంధించిన వ్యవహారం అయి ఉండొచ్చని డీఎస్పీ పేర్కొన్నారు.

## ఢిల్లీకి చేరుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్,11:**బ్రిక్స్ 18వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు, ప్రధాని నరేంద్ర మోడీ తో ద్వైపాక్షిక భేటీకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ఇ వాళ ఉదయం మూడు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి చేరుకున్నారు. రాజధానికి విచ్చేసిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు విదేశీ వ్యవసాయ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఘన స్వాగతం పలికారు. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత, రష్యా వెలుపల పుతిన్ ప్రత్యక్షంగా హాజరవుతున్న తొలి బ్రిక్స్ సదస్సు ఇదే కావడం విశేషం.రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా సంక్షోభం, హార్ముజ్ జలసంధి దిగ్బంధనం, అలాగే అమెరికాలో ప్రెసిమడెంట్ ట్రంప్ పాలనావర్గం విధిస్తున్న వాణిజ్య, సుంకం విధానాల వంటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిళ్ల నడుమ ఈ సదస్సు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా, ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్–సిసి, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, అబుదాబి క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్



బిన్ జాయెద్ అల్ నహ్యాన్, ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ అలీ, వియత్నాం ప్రధాని లే మిన్ హుంగ్ తదితర ప్రముఖ అంతర్జాతీయ నాయకులు హాజరుకానున్నారు. పర్యటనలో భాగంగా ఇవాళ పుతిన్ వార్షిక బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ ప్లీనరీ సమావేశంలో ప్రసంగించనున్నారు. సదస్సుకు ముందు ప్రధాని మోడీతో ప్రెసిడెంట్ పుతిన్ మధ్య జరగనున్న ద్వైపాక్షిక చర్చలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

## వీరభద్రుడి సన్నిధిలో మంత్రి పొన్నం దీక్ష విరమణ



భీమదేవరపల్లి: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 27 రోజుల నక్షత్ర దీక్షను పూర్తి చేసి శుక్రవారం నక్షత్ర మాల విరమించారు. ఇరుముడితో కొత్త కొండ కొండపైకి చేరుకున్న మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాల విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని, రాష్ట్ర ప్రజల జీవితాల్లో మరింత అభివృద్ధి, సంక్షేమం వెల్లివిరియాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు. 27 రోజుల పాటు నియమనిష్ఠలతో నక్షత్ర మాలను ధరించి దీక్షను పూర్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.

## స్టూడెంట్ వీసాలను తగ్గించిన

## ఆస్ట్రేలియా.. భారతీయులపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ విద్యార్థులకు జారీ చేసే వీసాలను ఆస్ట్రేలియా తగ్గించింది. దీంతో భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడింది. గడిచిన పదేళ్లలో స్టూడెంట్ వీసాల తిరస్కరించిన రేటు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది.

ఆ దేశ హోంశాఖ డేటా ప్రకారం 2026 జూన్‌లో 24.2 శాతం మేర స్టూడెంట్ వీసాలను ఆస్ట్రేలియా తిరస్కరించినట్లు తెలిసింది. 2016 జూన్‌లో 7.9శాతంగా ఉన్న తిరస్కరణ రేటు.. ఇక 2026 జూన్ వరకు అత్యధిక స్థాయికి చేరినట్లు ప్రభుత్వ డేటా ద్వారా వెల్లడైంది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో నేపాల్, ఇండియా స్టూడెంట్ల వీసాలను ఆస్ట్రేలియా అత్యధిక స్థాయిలో తిరస్కరించింది. నేపాల్‌కు చెందిన 51 శాతం మంది విద్యార్థులను వీసాలను, భారత్‌కు చెందిన 40 శాతం మంది విద్యార్థులను వీసాలను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఇక చైనా విద్యార్థుల వీసాల తిరస్కరణ రేటు 5.8 శాతం ఉన్నట్లు గుర్తించారు. వలసల అవసరాలకు తగినట్లు చెకింగ్ చేస్తున్నట్లు ఆస్ట్రేలియా చెబుతున్నా.. విద్యార్థుల వీసాలపై స్క్రూట్నీ పెరిగినట్లు డేటా ద్వారా తెలుస్తోంది. ఆస్ట్రేలియా వీసా తిరస్కరణకు గురైన విద్యార్థులు ముందుగా రెఫ్యూజల్ లెటర్‌ను పరిశీలించాలి, దాంట్లో పేర్కొన్న కారణాలను విశ్లేషించుకోవాలి, ఒకవేళ న్యాయపరంగా కరెక్టుగా ఉంటే, అవసరమైతే మళ్లీ దరఖాస్తు చేసుకునే వీలు ఉంటుంది. అడ్మినిస్ట్రేటివ్ రివ్యూ ట్రిబ్యునల్ ద్వారా విద్యార్థులు మరోసారి తమ వీసా అప్లికేషన్ చేసుకోవచ్చు.

# సంపాదకీయం

## రూపాయి ఎందుకు క్షీణిస్తోంది..?

డాలర్ పడిపోతున్న తరుణంలో ఆ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోవడం అంటే ఆర్థిక దారుణమేనా? డాలర్ బలంగా ఉండి అన్ని దేశాల కరెన్సీలు పడిపోతున్నాయి, ఆ క్రమంలో మన రూపాయి కూడా పడిపోతోందని అనుకున్నా ఒక అర్థం ఉంది.కానీ డాలర్ పతనం అవుతున్నా, మన రూపాయి విలువ పెరగక పోవడాన్ని ఏ విధంగా చూడాలి? అన్నదే చర్చగా ఉంది. అసలు ఈ విలువ పతనానికి కారణాలు విశ్లేషించడానికి ఆర్థిక నిపుణులకు ధైర్యం చాలడం లేదు. యూపీఏ హయాంలో మన్మోహన్ వంటి ఆర్థిక నిపుణుడు ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో.. రూపాయి విలువ పతనాన్ని అరికట్టేందుకు రిజర్వ్ బ్యాంకును రంగంలోకి దింపి విదేశీ కరెన్సీ విక్రయాలు చేసి రూపాయిని కాస్త బలం పుంజుకునేలా చేశారు. కనీసం పడిపోకుండా ఆపే ప్రయత్నం చేశారు. కానీ ప్రస్తుతం అలాంటి విధానాలను పట్టించుకోవడం లేదు. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపారాలపై ప్రభావం చూపిస్తోంది. పాలకుల వద్ద దీనికి పరిష్కారం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థైర్యాన్ని కొలిచే కీలక సూచీలో ఒకటి కరెన్సీ విలువ. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్ల ఒత్తిడికి, దేశీయ విధాన పరమైన వైఫల్యాలకు, రాజకీయ-ఆర్థిక అనిశ్చితులకు రూపాయి బలి అవుతుండటం స్పష్టంగా కనిపిస్తోంది. మొన్న రూపాయి విలువ భారీగా పతనం అయింది. డాలర్‌తో పోలిస్తే 90 రూపాయలు క్షీణించి ఆల్ టైం రికార్డ్‌గా నమోదైంది. ఇది మరింతగా పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు. అయినా మన పాలకులు రూపాయి ఎందుకు పడిపోయిందో గుర్తించి కట్టడి చేయాలని ఎందుకు అనుకోరు? విదేశీ మదుపుదారులు స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుం టున్నారు. వాటిని ఇతర చోట్లకు తరలిస్తున్నారు. వారంతా డాలర్ల రూపంలోనే లావాదేవీలు చేస్తారు కాబట్టి డాలర్లకు డిమాండ్ పెరిగి రూపాయి విలువ తగ్గుతోంది. ట్రంప్ బెది రింపులు, వాణిజ్య పోరు వంటి అనేక సమస్యలు కూడా పలు దేశాల కరెన్సీల విలువ పతనానికి కారణం అవు తున్నాయి. మనపైనా అదే ప్రభావం చూపిస్తోంది. రూపాయి పతనాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌బీఐ చెబుతున్నప్పటికీ అవన్నీ ఉత్తుత్తి ప్రయత్నాలే.. గతంలో రూపాయి పతనం అయిన ప్రతీసారి రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగి ఫారిన్ ఎక్సేంజ్‌ని మార్కెట్‌లో రిలీజ్ చేసి రూపాయి విలువ పతనం కాకుండా కాపాడేది. ఈ ఏడాది ఆగస్టు నాటికి ఆర్‌బీఐ మార్కెట్‌లో ఫారిన్ ఎక్సేంజ్‌గా విడుదల చేసే మొత్తం 11 బిలియన్ డాలర్లకు పడి పోయింది. ఆర్బీఐ విధానాన్ని పరోక్షంగా ప్రభుత్వ విధానంగా చెప్పుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఆర్బీఐ దగ్గర 684 బిలియన్ డాలర్ల ఫారిన్ ఎక్సేంజ్‌లు ఉన్నాయి. అయినా ఆర్‌బీఐ ఇప్పుడు జోక్యం చేసుకోవడం లేదు. ఈ రూపాయి విలువ పతనంలో ఆర్‌బీఐ చర్యలు తీసుకోలేక చేతులు ఎత్తేసింది. ఈ ఏడాది అక్టోబర్ 27తో పోలిస్తే ఇండియన్ రూపీ 3.5 శాతం పడిపోయింది. రూపాయి పతనం చెందుతున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం రివర్స్‌లో ఆలోచిస్తుంది. నిర్మలా సీతా రామన్ రూపాయి బలహీనపడడం కాదు, డాలరే బలహీన పడుతుందని ప్రకటించారు. పైగా మన దేశ ఎకానమీ ఫండమెంటల్స్ బలంగా బాగానే ఉన్నాయి. గ్లోబల్ పరిస్థితుల వలన రూపాయి పడిపోతున్నదని వాదిస్తున్నారు. అదే నిజమైతే గ్లోబల్ గానే డాలర్ పరిస్థితి బాగా లేదు. డాలర్ కూడా పతనం చెందుతుంది. మరి ఇలాంటి సందర్భంలో మన రూపాయి విలువ ఎందుకు పడిపోతుందో చెప్పకుండా దాట వేస్తున్నారు. డాలర్‌తో పోల్చినప్పుడు ఇతర దేశాల కరెన్సీ పెరుగుతుంటే, డాలర్ తగ్గుతుంటే ఇండియా రూపాయి మాత్రం ఎందుకు తగ్గుతోంది? దీనిని ప్రభుత్వం ఎందుకు ప్రస్తావించడం లేదు. ఎగుమతులు చేస్తే డాలర్లు వస్తాయి. దిగుమతుల వల్ల డాలర్లు రావు, డాలర్స్ సంపాదిస్తున్న దానికి ఖర్చు పెడుతున్న దానికి ఇన్ బ్యాలెన్స్ వల్లన డిమాండ్ సప్లై మిస్ మ్యాచ్ అయ్యి రూపాయి పతనం చెందుతుంది. ఈ అసమతుల్యత వల్ల కూడా రూపాయి పతనం అవుతోంది. డాలర్ విలువ పెరుగుతున్న ప్రతిసారీ, భారత్ చెల్లించాల్సిన ఇంధన బిల్లులు అమాంతం పెరుగుతాయి. దాని ప్రభావం పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో ప్రజల జేబులకు నేరుగా తాకుతుంది. ట్రాన్స్‌పోర్టు ఖర్చు పెరగడం వల్ల ద్రవ్యోల్బణం మరింత ముదురుతుంది. కూరగాయల నుంచి నిర్మాణ సామగ్రి వరకు అన్ని రంగాల ధరలు పైకెక్కుతాయి. రూపాయి పతనం ఒక సంఖ్య మార్పు కాదు. దేశ ప్రజల మీద అదనపు భారం పడుతుంది. రూపాయి పతనం ఎంతో మంది జీవితాలపై వ్యాపా రాలపై ప్రభావం చూపిస్తోంది. సామాన్యులకు జేబు గుల్ల అవుతుంది. దిగుమతుల మీద ఆధారపడిన వస్తువుల ఉత్పత్తి ఖర్చులు పెరుగుతాయి. దానివల్ల వాటి రేట్లు పెంచాల్సి వస్తుంది. రూపాయి పతనం వలన ద్రవ్యోల్బణం, దాంతో ధరల పెరుగుదలకు దారితీస్తుంది కొనుగోలు శక్తి తగ్గుతుంది. బలహీనమైన రూపాయి కారణంగా దిగుమతులు మరింత ఖరీదుగా మారుతున్నాయి. ఆ స్థాయిలో ఎగుమతులు లేకపోవడంతో లోటు భారీగా పెరుగుతోంది. దీనికితోడు ఉపాధి అవకాశాలు కుదించుకుపోవడం, తలసరి ఆదాయం పెరగకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు పైపైకే పోతుండటం, జీవన ప్రమాణాలు పడిపోవడం వంటి మోడీ ప్రభుత్వ విధానాల ఫలితాలు కూడా దేశీయ ఆర్థిక రంగాన్ని మరింత సంక్షోభం వైపు నెడుతున్నాయి.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# ఉక్రెయిన్ పై రష్యా దండయాత్రకు నాలుగేళ్లు..




ప్రారంభమైన ఉక్రెయిన్‌పై రష్యా దాడులు పూర్తి యుద్ధంగా మారి నాలుగేళ్లు దాటుతున్న వేళ, ఈ యుద్ధ మారణహోమానికి ముగింపే కనిపించడం లేదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాలో అతి పెద్ద సైనిక సంఘర్షణగా నిలుస్తున్నది. తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టాలతో పాటు మిలియన్ల మంది స్థానభ్రంశం, మౌళిక సదుపాయాల విధ్వంసాలు నమోదు కావడం విచారకరం. ఉక్రెయిన్ అద్భుత ధైర్యసాహసాలతో, పాశ్చాత్య దేశాల మద్దతుతో రష్యా దాడులను సమర్థవంతంగా తిప్పికొడుతూ "స్టీల్ పోర్కుపైన్" రక్షణను కొనసాగిస్తున్నది. వేలాది మంది ప్రాణాలు కోల్పోవడం, మిలియన్ల కొద్ది ప్రజలు శరణార్థులుగా మారడంతో ఒక తరం తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేసింది. రష్యా బలగాలు ఉక్రెయిన్‌లోకి కీలక మౌళిక వనరులు, పవర్ గ్రిడ్‌లను లక్ష్యంగా చేసుకొని "ఇంధన ఉగ్రవాదం (ఎనర్జీ టెర్రరిజమ్)" మార్గాలను అనుసరిస్తున్నది. ఉక్రెయిన్ ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి రష్యా, తన సార్వభౌమాధికారాన్ని కాపడుకోవడానికి యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయి. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా, ఆహార భద్రత, దౌత్య సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఉక్రెయిన్ తన ప్రాదేశిక సమగ్రతను కాపాడకపోవడానికి, అంతర్జాత చట్టాల ప్రకారం శాంతిని కోరుకుంటూ, రష్యా దాడులకు బదులు ఇస్తున్నది. గత 27 మాసాలుగా ఇజ్రాయిల్-పాలస్తీనా యుద్ధం కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదిరినట్లే కుదిరి తిరిగి ఆయుధాల మంటలు ఎగిసిపడడం కొనసాగుతోంది. ఉక్రెయిన్‌పై రష్యా దాడిలో అపార ఆస్తి, ప్రాణ నష్టాలు:

ఉక్రెయిన్ - రష్యా యుద్ధంలో ఇరు పక్షాలకు చెందిన లక్షల మంది సైనికులు, సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోగా, మిలియన్ల కొద్దీ గాయపడడం, పది మిలియన్లకు పైగా ఉక్రెనియన్లు నిర్వాసితులుగా మారి శరణార్థి శిబిరాల్లో అమానవీయ దుస్థితుల్లో ప్రాణాలను బిగబట్టి ఊపిరి పీల్చుకుంటున్నారు. వివిధ అంచనాల ప్రకారం ఇప్పటి వరకు లక్ష వరకు ఉక్రెనియన్ బలగాలు చనిపోగా, 4 లక్షలకు పైగా గాయపడ్డారు. అదే విధంగా కనీసం 12.25 లక్షల రష్యా బలగాలు ప్రాణాలను కోల్పోవడం లేదా గాయపడడం జరిగినట్లు తెలుస్తున్నది. రష్యా ఆక్రమించిన భూభాగాన్ని వెనక్కి తీసుకోవడానికి ఉక్రెయిన్, ఉక్రెయిన్‌ను ఆక్రమించాలని రష్యా తమ తమ పోరాటాలను ఉధృతంగా చేస్తున్నాయి. నేడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ విరమణకు చేసిన ప్రయత్నాలు పని చేయలేదు. నేటికి ఉక్రెయిన్ దాదాపు 6 లక్షల వరకు మరణించి లేదా గాయపడి ఉంటారని తెలుస్తున్నది. ఉక్రెయిన్ : రష్యా పక్షాల మరణాలు/గాయపడిన వారి నిష్పత్తి 1 : 2.5 ఉండవచ్చని తెలుస్తున్నది. నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు కనబడడం లేదు. రష్యా ఏకపక్షంగా విలీనం చేసుకున్న నాలుగు ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఉక్రెయిన్‌కు ఇవ్వడం జరగదని రష్యా పట్టుపడుతోంది. ఇప్పటికే ఉక్రెయిన్‌కు చెందిన 18 శాతం భూభాగం రష్యన్ నియంత్రణలోకి వెళ్లింది. ఏకపక్షంగా ఉక్రెయిన్ బలహీన దేశమంటూ రష్యా చేసిన దండయాత్రతో పుతిన్ భారీ మూల్యం చెల్లిస్తున్నారు. ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరకూడదని, రష్యా రసరిహద్దుల వరకు నాటో కూటమి విస్తరణ జరగడం తమ భద్రతకు ప్రతికూలమని పుతిన్ వాదిస్తున్నారు. ఉక్తెయిన్ ఒక స్వతంత్ర దేశమే కాదని రష్యా విచిత్రంగా వాదిస్తోంది. ఉక్రెయిన్ గత చరిత్ర - యుద్ధం ప్రారంభం: 1700ల్లో రష్యా సామ్రాజ్య పాలనలో ఉన్న ఉక్రెయిన్ 1917లో రష్యా ఉద్యమంతో రష్యా సామ్రాజ్య పాలన నుంచి విముక్తమై 1922లో సోవియట్ యూనియన్‌లో భాగమై పోయింది. 1930ల్లో మిలియన్ల ఉక్తెనియన్లు కరువుకాటకాలతో ప్రాణాలను కూడా కోల్పోవడం జరిగింది.

1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో మరో సారి ఉక్రెయిన్ స్వతంత్ర దేశంగా నిలబడింది. 2014లో క్రిమియాను రష్యా ఆక్రమించడం, ఉక్తెయిన్ వేర్పాటువాదులకు రష్యా మద్దతు ఇవ్వడం కూడా ఉక్రెయిన్ కోపానికి కారణం అయ్యింది. నాటో తన దేశాన్ని ఆక్రమించారని చూస్తున్నదని రష్యా, రష్యా నుంచి తమ దేశ ప్రాంతాలకు ప్రమాదం ఏర్పడుతున్నదని ఉక్రెయిన్ భావించడంతో యుద్ధ విరమణ దిశగా అడుగులు పడడం లేదు. సాయుధ పోరు కొనసాగుతూనే ఉన్నది. రష్యాలోని మెజారిటీ ప్రజలే కాకుండా పుతిన్ లాంటి నాయకులు కూడా ఉక్రెయిన్ తమ దేశంలో భాగమే అని భావించడంతో రెండు దేశాల మధ్య విభేదాలు రోజు రోజుకు పెరగడం, చివరకు 24 ఫిబ్రవరి 2022న రష్యా పూర్తి స్థాయి దాడి చేయడంతో యుద్ధం అనివార్యం అయ్యింది. 2019లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో పాటు అమెరికా, యూరోప్ దేశాల సహకారంతో యుద్ధం మారణహోమంగా మారింది. రష్యా పక్షాన చైనా, ఇరాన్, ఉత్తర కొరియాలు నిలవడంతో నువ్వా నేనా అనే రీతిలో మారణహోమం కొనసాగుతున్నది.

# చిన్నారులపై ఇజ్రాయిల్ దాష్టికాలు...

చిన్నారులపై ఇజ్రాయిల్ దాష్టికాలను యుఎన్ భద్రతామండలి తాజాగా బయటపెట్టింది. 2024 జనవరి నుండి ఆక్రమిత వెస్ట్ బ్యాంక్ (ఆక్రమిత తూర్పు జెరూసలేంతో సహా) ప్రాంతంలో కనీసం 174 మంది పాలస్తీనా పిల్లలు మరణించారని యునిసెఫ్ వెల్లడించింది. అంటే వారానికి ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు మరణించారని పేర్కొంది. ఇదే సమయంలో 1500మందికి పైగా చిన్నారులు గాయాలపాలయ్యారని, వారిలో సగం మంది తూటాల కారణంగా గాయపడ్డారని యుఎన్ భద్రతా మండలి (యుఎన్ఎస్‌సి) లో యునిసెఫ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హనన్ సులేమాన్ పేర్కొన్నారు. చిన్నారులు పారిపోతున్న సమయంతో కూడా వారిపై కాల్పులు జరిపిన ఘటనలను యుఎన్ నమోదు చేసిందన్నారు. పిల్లలపైకాల్పులు, దాడులు, కత్తిపోట్లు, పెప్పర్ స్ప్రే జరిగాయని, అలాగే వారి నివాసాలు, జీవనోపాధి, నీటి మౌలిక సదుపాయాలపై కూడా దాడులు జరిగాయని తెలిపారు. ఇజ్రాయిల్ జైలు సర్వీసు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. వెస్ట్ బ్యాంక్‌కు చెందిన సుమారు 355మంది పాలస్తీనియా చిన్నారులు ఇజ్రాయిల్ సైనిక నిర్భంధంలో ఉన్నారని సులేమాన్ పేర్కొన్నారు. ఇది గత ఎనిమిదేళ్లలో అత్యధిక సంఖ్య అని అన్నారు. వారిలో సుమారు సగం మంది అంటే 164మంది పిల్లలు ఎటువంటి అభియోగాలు లేదా విచారణ లేకుండా నిర్బంధాన్ని ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతిప్రాంతంలోని చిన్నారులందరికీ ఉన్నట్లే వెస్ట్‌బ్యాంక్‌లోని చిన్నారులకు కూడా జీవించే, విద్యనభ్యసించే, రక్షణ పొందే, హింస, భయాలకు అతీతమైన భవిష్యత్తును ఊహించుకునే హక్కులు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. చిన్నారులు పారిపోతున్న సమయంతో కూడా వారిపై కాల్పులు జరిపిన ఘటనలను యుఎన్ నమోదు చేసిందన్నారు.

# పురాణ పురుషులు... మల్లాది చంద్ర శేఖరులు

ఆయన పురాణ ప్రవచనం గావిస్తుంటే పండిత పామరులు మంత్రముగ్ధులయి తీరాల్సిందే. ధర్మసందేహాలు కార్యక్రమంలో శ్రోతల సందేహాలకు సమాధా నాలు చెబుతుంటే కార్యక్రమంలో లీనం కావాల్సిందే. భద్రాచాల సీతారాముల కల్యాణానికిగాని, తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు గాని, శ్రీశైలంలో భ్రమరాంబా మల్లికార్జునుల కల్యాణానికి గానీ వ్యాఖ్యానం చేస్తుంటే శ్రోతలు తమ చెవులు అప్పగించాల్సిందే. ఆయన గళం నుంచి వెలువడే ప్రతిమాటా సప్రామాణికం, సవ్యాఖ్యాన సహితం...ఆయనే అభినవ వేదవ్యాస మహర్షిగా లబ్ద ప్రతిష్టులైన పౌరాణిక సార్వభౌమ మల్లాది చంద్ర శేఖర శాస్త్రి.మల్లాది ప్రముఖ పండితులు, పురాణ ప్రవచకులు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టు కారణంగా పురాణ ప్రవచన ప్రముఖులలో ఆయన ప్రత్యేకతను సంతరించు కున్నారు. తన పదిహేనవ ఏట నుంచి ప్రారంభించిన ఈ ప్రవచన యజ్ఞం అసిధారా వ్రతంగా కొనసాగుతునే ఉంది. సహస్ర చంద్ర దర్శనం చేసుకున్నా, శత జయంతి వేడుకల సమయాన్ని సమీపిస్తున్నా, జీరవోని గొంతుతో, ఉపన్యాసం, హరికథ, నాటకం, పురాణం కలిపి శ్రోతలను ఆకట్టుకునే విధంగా చేస్తున్న ప్రవచనాలు ఆయన అసమాన ప్రతిభకు నిదర్శనాలు. మల్లాది దక్షిణామూర్తి దంపతులకు 1925 ఆగస్టు 22న భాద్రపద శుక్ల తృతీయ నాడు అర్ధరాత్రి, అంటే తెల్లవారితే వినాయక చవితి అనగా సనాతన సత్సంప్ర దాయం గల కుటుంబంలో ఆయన జన్మించారు. తాతగారు మల్లాది రామకృష్ణ విద్వత్ చయనుల వద్ద పెరిగిన క్రమంలో, నాయనమ్మ కృష్ణవేణి సోమిదమ్మ సాకగా, తాతగారే ఉపనయన సంస్కారం చేశారు. ఆయన వద్దనే తర్క ప్రకరణాలు, శ్రౌతస్మార్తాలు అభ్యసించారు. ఆయన పితృదేవులు దక్షిణామూర్తి శాస్త్రి పుష్పగిరి ఆస్థాన పండితులు. ఆర్ష సంప్రదాయాన్ని ఆయన వద్దనే అలవరచుకున్నారు. పెత్తండ్రి వీరరాఘవ శాస్త్రి తర్కవేదాంత పండితులు. పినతండ్రి హరిశంకర శాస్త్రి తెనాలిలో వేదవిద్యా పరీక్షాధికారిగా పని చేసేవారు. పినతండ్రి వద్దే వేదాధ్యయనం గావించి, కంభంపాటి రామ్మూర్తి శాస్త్రి వద్ద పూర్వ మీమాంస, వ్యాకరణం నేర్చుకున్నారు. తెలుగు మాత్రం వీధిబడిలో చదువు కున్నారు.తాతగారికి, మనమడు పురాణ ప్రవచనం చెప్పాలని కోరిక. ఆంగ్ల విద్య అభ్యసిస్తే, ఉద్యోగం చేస్తానంటారని ఎలాంటి పరీక్షలు రాయ నివ్వకుండా తాత జాగ్రత్త పడ్డారు. అయితే శాస్త్రికి పురాణాలు చెప్పడం ఇష్టం ఉండేది కాదు. అది గ్రహించిన తాతగారు "చూడు నాయనా, పురాణ ప్రవచనం చెప్పాలంటే సంస్కృత వాఙ్మయం తెలిసి ఉండాలి. నిశిత పరిశీలన కావాలి. అన్వయం చెప్పగలిగి ఉండాలి. వేదాంతం, తర్కం, ఛందస్సు తెలిసుండాలి. కాబట్టి దీన్ని అంత తేలికగా తీసేయకు" అని చెప్పేవారు. పదిహేడవ యేట తాత కాలం చేశారు. ఆయన దూరమైనా ఆయన సంకల్పం మాత్రం ఎప్పుడూ చంద్రశేఖర శాస్త్రిని అంటిపెట్టుకునే ఉంది. కొంత కాలం తరువాత బెజవాడ వెళ్లి వేదాంత శాస్త్రం చదవాలనే కోరికతో అమరావతి నుంచి గుంటూరు వెళ్లారు. బస్టాండు కొచ్చాక పరిచయస్థులు కొందరు కనిపించి "పుష్పగిరి పీఠాధిపతులు ఇప్పుడు నరసరావు పేటలో ఉన్నారు. త్వరలో ఆయన మకాం మార్చేస్తారట. ఈలోగా నువ్వొకసారి వెళ్లి ఆయన దర్శనం చేసుకోవచ్చు" అని సలహా ఇచ్చారు. దాంతో వెంటనే నరసరావు పేటకు వెళ్ళి,స్వాముల వారి దర్శనం చేసుకోగానే పీఠాధిపతులు 'నువ్వు అమరావతిలో పురాణ ప్రవచనం చక్కగా చెప్తావని తెలిసింది. నాకు కూడా వినాలని ఉంది, ఇవ్వాళ ఇక్కడ పురాణం చెప్పు" అన్నారు. ఆ మాటలను ఆదేశంగా తీసుకుని ఆయన ముందు వాల్మీకి రామాయణం చెప్పారు. స్వామివారు చాలా సంతోషించి, నెలకు 40 రూపాయల గ్రాసం మీద పుష్పగిరి ఆస్థానంలో పురాణ పండితునిగా నియమించారు. ఆయనతో పాటే ఊరూరూ తిరుగుతూ ఏడాదిన్నర పాటు చంద్ర శేఖర శాస్త్రి పురాణ ప్రవచనం చెప్పారు. తర్వాత పెత్తండ్రి మల్లాది వీరరాఘవ శాస్త్రి బెజవాడలో బ్రహ్మ సత్రయాగం జరుపుతుంటే ఆయన కోరిక మేరకు అక్కడ సుమారు సంవత్సరం పాటు ప్రవచనం చేశారు. ఆయన ఇరవై అయిదవ ఏట సీతారామ ప్రసన్నతో వివాహం జరిగింది. సరిగ్గా ఏడాది తర్వాత అంటే 1951లో ఆయనకు కొడుకు పుట్టాక తాతపై గల గౌరవంతో, జ్ఞాపకార్థం రామకృష్ణ అని పేరుపెట్టు కున్నారు. దివంగత ప్రధాని పాములపర్తి నరసింహారావు, దివంగత ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, వంటి రాజకీయ ప్రముఖులతో పాటు చిత్తూరు వి.నాగయ్య, ఘంటసాల, ఎస్వీరంగారావు, కన్నాంబ వంటి వెండితెర నటీ నటులు ఆయన ప్రవచనాలను ఎంతో ఇష్టపడేవారు. ఒక సందర్భంలో చిత్తూరు నాగయ్య ఇంటికి పిలిచి భోజన వస్త్రాలతో సత్కరించి, చేతికి స్వర్ణకంకణం తొడగడం శాస్త్రి మరచి పోలేని జ్ఞాపకం. చాలామంది సినిమాలలో నటించమని అడిగితే ఇష్టం లేక తిరస్కరించారు. ఆయన ప్రవచనం చెబుతుండగా శ్రోతలు వింటున్నట్లుగా ఉండే దృశ్యాన్ని చిత్రీకరించాలని కొందరు దర్శకులు ప్రయత్నాలు చేసినా, ఎందుకనో అది కూడా వీలు పడక పోవడం యాదృచ్ఛికం. వందలాది రామాయణ, మహాభారత, భాగవత ప్రవచనాలూ నిర్వహించడమే కాకుండా, ప్రతియేటా ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసేవారు. దూరదర్శన్‌లో, సప్తగిరి చానల్‌లో ప్రవచనాలు కొనసాగించే ప్రయత్నం చేశారు. వయసు మీద పడుతుం డడంతో, శారీరిక శక్తి సన్నగిల్లి, ప్రయాణాలు చేయ లేకుండా ఉన్న కారణంగా 2011 జనవరి నుంచి పురాణ ప్రవచనాలు చెప్పడం క్రమంగా తగ్గించారు. శ్రీవేంకటేశ్వర భక్తిచానల్, సప్తగిరి చానల్ వారు తమ చానల్‌లో ప్రవచనం చెప్పవలసిందే అని పట్టు బట్టడంతో తమ ఇలవేల్పు పట్ల ఉన్న భక్తి, గౌరవం మేరకు వారిని కాదనలేక పోయారు. శోకరసమైతే దుఃఖంలో దుఃఖ సాగరంలో, హర్ష దాయకమైతే ఆనందంతో మమేకమై పరవశించి పోయే ఆయన ప్రవచనంలో లీనమయ్యే తీరు దశాబ్దాల ప్రవచన కాలంలో శ్రోతల, ప్రేక్షక జన బాహు ళ్యానికి సన్నిహితంగా ఉంచింది. మల్లాది చంద్రశేఖర శాస్త్రి సుదీర్ఘ పురాణ ప్రవచన ప్రస్థానంలో ఎందరో ప్రముఖులు, ప్రముఖ సంస్థలతో లెక్కలేనన్ని సన్మానాలు, సత్కారాలు, బిరుదులు పొందారు. అందులో ప్రముఖంగా తిరుమల తిరుపతి దేవస్థానాలలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో స్వామి వారి కల్యాణ వ్యాఖ్యాతగా అభినవ వ్యాస బిరుదును పొందారు. శృంగేరి పీఠాధిపతి చంద్రశేఖర స్వామి ఆశీర్వచనంతో సవ్యసాచి బిరుదును, భీముని పట్నం సద్గురు శివానందమూర్తి నెలకొల్పిన సనాతన ధర్మట్రస్ట్ ద్వారా ఎమినెంట్ సిటిజన్ అవార్డును అందుకోవడమే కాక మాజీ ప్రధాని పి.వి నరసింహారావుతో సత్కారం అందుకున్నారు.

# యూఎస్‌లో లక్షకు పైగా వీసాల రద్దు!




నేరపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో 2025 లో అమెరికా లక్షకు పైగా వీసాలను రద్దు చేసింది.వాటిలో సుమారు 8,000మంది విద్యార్థుల వీసాలు ఉన్నాయి. "అమెరికాను సురక్షితంగా ఉంచే చర్యల్లో భాగంగా మేము ఈ నేరస్తులను బహిష్కరిస్తూనే ఉంటాము" అని విదేశాంగ శాఖ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. "విదేశాంగశాఖ ఇప్పుడు లక్ష వీసాలను రద్దు చేసింది.వాటిలో సుమారు 8,000 విద్యార్థి వీసాలు మరియు నేరపూరిత కార్యకలాపాలకు సంబంధించి అమెరికా చట్ట అమలు సంస్థల విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తులకు చెందిన2,500 ప్రత్యేక వీసాలు కూడా ఉన్నాయి" అని పేర్కొంది. ఏడాది కంటే తక్కువ సమయంలో ట్రంప్ యంత్రాంగం లక్ష వీసాలను రద్దు చేసిందని స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ డిప్యూటీ స్పోక్‌పర్సన్ టామీ పిగోట్‌పేర్కొన్నారు. దాడి,దొంగతనం మరియుమద్యంసేవించి వాహనం నడపడం వంటి నేరాలకు పాల్పడిన వారు లేదా దోషులుగా తేలిన వేలాది మంది విదేశీ పౌరుల వీసాలు కూడా ఇందులో ఉన్నాయని ఆయన తెలిపారు.

# వైసీపీ నేతలకు సన్ స్ట్రోక్స్..!



**విజయవాడ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వింత పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీలో దూకుడు కలిగిన నేతలు చుట్టూ ఇప్పుడు కేసులు అలుముకుంటున్నాయి. అయితే అవి కూటమి ప్రభుత్వం పెట్టిన కేసులు కాదు. వారి వ్యక్తిగత, కుటుంబ వ్యవహారాలతో నమోదవుతున్నవే అధికం. తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ ఫ్యామిలీ పై ఏకంగా సొంత కోడలు ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఫ్యామిలీకి చిక్కులు తప్పేలా లేవు. మాజీ మంత్రి అప్పలరాజు కొడుకు మూలంగా ఇబ్బందులు తెచ్చుకున్నారు. కొడుకు తో పాటు అరెస్టయ్యారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం అరెస్టయ్యే అవకాశం ఉంది. అది కూడా కుమారుడు మూలంగానే. ఎందుకంటే కుమారుడి పేరుతో.. ఆస్తి యజమాని బతికి ఉండగానే తప్పుడు ధృవీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించారు కాబట్టి.కేవలం కుమారుల మూలంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు పోలీస్ కేసులకు చిక్కారు. అరెస్టులు సైతం నడుస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలు అనేవి సహజం. అలానే రోడ్డు ప్రమాదానికి కారణం అయ్యారు మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడు. అయితే కుమారుడ్ని కేసు నుంచి తప్పించేందుకు మరొకరిని బలిపశువు చేశారు అప్పలరాజు. అలా కుమారుడ్ని బయటపడేసే క్రమంలో ఇద్దరు దొరికిపోయారు.

ప్రస్తుతం ఇద్దరూ ఒకే జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. అయితే పెద్దమనిషి పాత్ర పోషించి సమస్య పరిష్కరించుకుంటే బాగుండేది. కానీ దానిని రాజకీయ కుట్రగా ఆయన అభివర్ణిస్తున్నారు.మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం అలానే తన కుమారుడు మూలంగా కేసుకు గురయ్యారు. తన కుమారుడికి అడ్డగోలుగా నాలుగు కోట్ల రూపాయల విలువైన భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు.. ఏకంగా బతికున్న యజమానిని చనిపోయినట్టు చూపించి.. వారి వారసుల పేరుతో తప్పుడు ధృవీకరణ పత్రాలు రూపొందించి.. కుమారుడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నప్పుడు, ఒక పెద్ద మనిషిగా చలామణిలో ఉన్నప్పుడు ఇటువంటి అడ్డగోలు వ్యవహారానికి తెర తీశారు. ఇప్పుడు అడ్డంగా బుక్కయ్యారు. ఏకంగా ఫ్యామిలీతో పాటు పరారీ అయ్యారు.ఇప్పుడు తాజాగా మాజీ మంత్రి జోగి రమేష్ కూడా ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ఈయన కూడా కుమారుడి వల్ల కేసుల్లో చిక్కుకున్నారు. ఆయన ఒక్కరే కాదు ఫ్యామిలీ మొత్తం 11 మందిపై ఇప్పుడు సొంత కోడలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు అయింది. వరకట్నం తో పాటు గృహహింస పాల్పడుతున్నారంటూ సొంత కోడలు ఫిర్యాదు చేయడం మాత్రం సంచలనంగా మారింది. ఏడాది కిందట కుమారుడికి వివాహం జరిగింది. ఇంతలోనే ఈ వివాదం తలెత్తింది. పరిష్కరించాల్సిన పెద్దమనిషి పాత్రలో ఉండగా నిర్లక్ష్యం చేయడంతోనే ఈ పరిస్థితికి వచ్చింది. ఇది కూడా రాజకీయ కుట్రగా అభివర్ణిస్తున్నారు జోగి రమేష్. ఇలా వైసిపి నేతలకు కుమారుల వల్ల తలవొంపులు వస్తుండడం మాత్రం నిజంగా ఆందోళన కలిగించే విషయమే.

# ఆయుధ నైపుణ్యంతో ప్రజల భద్రతకు మరింత భరోసా కల్పిద్దాం : జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



వనపర్తి : వార్షిక ఫైరింగ్ లో సిబ్బందితో కలిసి ఆయుధ నైపుణ్యాన్ని పరీక్షించుకున్న జిల్లాలో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్. ఫైరింగ్‌లో ప్రతిభ కనబర్చిన అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆయుధాల వినియోగంపై సంపూర్ణ అవగాహన, నైపుణ్యం అత్యంత అవసరమని, క్రమశిక్షణ, శారీరక ధృఢత్వం, వృత్తిపరమైన నైపుణ్యాలతో సేవలందించడం ద్వారానే పోలీసుశాఖ ప్రతిష్ఠ మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. అన్నారు. శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో వనపర్తి జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని అదనపు ఎస్పీ, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆయుధాలతో ఫైరింగ్ నిర్వహించి తమ నైపుణ్యాన్ని పరీక్షించుకున్నారు.శిక్షణలో భాగంగా విధుల్లో వినియోగించే ఆయుధాలతో ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి పది రౌండ్ల ఫైరింగ్ చేసే అవకాశం కల్పించారు. ఫైరింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో కూడా ఇదే నైపుణ్యాన్ని కొనసాగించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ వద్ద ఉన్న ఆయుధాల పనితీరు, వినియోగ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆయుధాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సక్రమ స్థితిలో ఉంచాలని ఆదేశించారు.విధి నిర్వహణలో శారీరక ధృఢత్వం ఎంతో కీలకమని, అందుకే ప్రతి పోలీసు ప్రతిరోజూ వ్యాయామాన్ని జీవితంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. మంచి ఆరోగ్యం, మానసిక స్థైర్యం, అప్రమత్తతతో పనిచేస్తేనే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలమన్నారు.చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, పోలీసుశాఖ గౌరవానికి భంగం కలిగించే ఎలాంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. ప్రతి పోలీసు నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు.వ్యక్తిగత, కుటుంబ, విధి నిర్వహణ లేదా ఆరోగ్య సంబంధిత సమస్యలు ఎదురైనా వాటిని దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారానికి శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అలాగే ప్రతి పోలీసు సిబ్బంది క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, తెలంగాణ పోలీసుశాఖకు, వనపర్తి జిల్లా పోలీసులకు మరింత మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంతో సేవలందించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్, అప్పలనాయుడు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వినోద్, జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 19వ సంవత్సరంలోకి శాకంబరీ ఉత్సవాలు

## -దేదీప్యమానంగా రూపుదిద్దుకుంటున్న దుర్గమ్మ సన్నిధి



**విజయవాడ :** ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో ప్రతి ఏటా అత్యంత వైభవంగా నిర్వహించే "శాకంబరీ ఉత్సవాలు" ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు దేవస్థాన యంత్రాంగం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ ఉత్సవాల వివరాలను వెల్లడించారు.ప్రకృతి స్వరూపిణి అయిన శ్రీ అమ్మవారికి ప్రకృతిలో లభించే వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు మరియు పండ్లతో అలంకరించడమే శాకంబరీ ఉత్సవం. భూలోకంలో సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు మరియు రైతాంగం సుఖసంతోషాలతో జీవించాలని కాంక్షిస్తూ ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలు 2007వ సంవత్సరంలో అప్పటి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్. చంద్రశేఖర్ ఆజాద్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. అప్పట్లో దేవస్థాన అర్చక బృందం వరంగల్ భద్రకాళీ ఆలయంలో జరిగే క్రతువులు, శాస్త్ర ప్రమాణాలను పరిశీలించిన అనంతరం ఇంద్రకీలాద్రిపై ఈ సంప్రదాయాన్ని ప్రారంభించిచారు.

నాటి నుండి నేటి వరకు గత 19 సంవత్సరాలుగా దుర్గమ్మ సన్నిధిలో ఈ శాకంబరీదేవి పూజలు నిరంతరాయంగా, వైభవంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఎల్ నినో (ఇశ్రీ ఔత్రినీ) ప్రభావం వల్ల వర్షాలు లేక మార్కెట్లో కూరగాయల లభ్యత తక్కువగా ఉన్నప్పటికీ, దేవస్థాన సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వివిధ ప్రాంతాలకు వెళ్లి రైతులు, వ్యాపారుల నుండి విరాళాలు సేకరించారు. ఆదివారం సాయంత్రం నాటికే సుమారు 32 టన్నుల కూరగాయలు, ఆకుకూరలు ఇంద్రకీలాద్రికి చేరుకున్నాయి. దీనికి తోడు విజయవాడ కేదారేశ్వర పేట హోల్‌సేల్ పండ్ల మార్కెట్ నుండి ఈరోజు రాత్రికి మరో 4 టన్నుల పండ్లు విరాళంగా రానున్నాయి. రైతులు ఎంతో శ్రమతో అందించిన కూరగాయలు, పండ్లు ఆలయం వెలుపల అలంకరణల వల్ల వృథా కాకుండా దేవస్థానం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే శాస్త్రోక్తంగా కాయగూరల దండలను సిద్ధం చేశామని, ప్రాంగణమంతా అత్యంత శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నామని ఈవో వివరించారు. ఈ మహోత్సవాలు జరిగే ఈ మూడు రోజులలోనూ అమ్మవారి దర్శన సమయాలు సాధారణ రోజుల్లో మాదిరిగానే యథావిధిగా కొనసాగుతాయని, దర్శన సమయాలలో ఎటువంటి మార్పులు ఉండవని ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు.దేవస్థానం ధర్మకర్తలమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ), సభ్యులు, దేవస్థానం సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతున్నామని,ఈ పవిత్ర ఉత్సవాలలో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాల్సిందిగా ఈవో కోరారు

# వర్షాభావంతో అల్లాడుతున్న రైతులకు జనసేన అండ

## -రైతన్నల కష్టాలను తెలుసుకుని భరోసా

## -ప్రభుత్వం రైతుల పక్షాన నిలుస్తుందని హామీ



**కోడుమూరు, :** సకాలంలో వర్షాలు కురవక పంటలు ఎండిపోతుండటంతో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులను కోడుమూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు సంధ్యా విక్రమ్ కుమార్ సోమవారం పరామర్శించారు. కోడుమూరు మండలం వర్కూరు గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న వ్యవసాయ పొలాన్ని సందర్శించిన ఆయన, పంటల పరిస్థితిని స్వయంగా పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలాల్లో నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా గమనిస్తూ, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, పెట్టుబడులు, దిగుబడులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఇటీవల వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీల కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశామని, కానీ వర్షాభావంతో పంటలు దెబ్బతింటుండటంతో తీవ్ర ఆర్థిక నష్టాలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. బోర్లు, చెరువుల్లో కూడా నీటి మట్టం తగ్గిపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు వాపోయారు.ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, వ్యవసాయం పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి ఉంటుందని, వర్షాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందనే నమ్మకం తమకు ఉందన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను ఓపికగా విన్న సంధ్యా విక్రమ్ కుమార్ మాట్లాడుతూ, రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల కష్టసుఖాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తోందని, రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందన్నారు.ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితిని ప్రభుత్వం అత్యంత సానుభూతితో పరిశీలిస్తోందని, అవసరమైతే సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో పంట నష్టాలను అంచనా వేసి రైతులకు తగిన సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు.ప్రకృతి వైపరీత్యాలు రైతులను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని పేర్కొన్న ఆయన, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సూచించే శాస్త్రీయ సలహాలను పాటించాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు.వ్యవసాయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని సంధ్యా విక్రమ్ కుమార్ అన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వారికి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రతి రైతు సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రైతులతో కలిసి పొలాల్లో తిరుగుతూ పంటల పరిస్థితిని పరిశీలించిన సంధ్యా విక్రమ్ కుమార్, వర్షాలు కురిసి రైతుల కష్టాలు తొలగిపోవాలని ఆకాంక్షించారు. గ్రామంలో పలువురు రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, భవిష్యత్తులో కూడా రైతులకు అందుబాటులో ఉంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్కూరు జనసేన నాయకులు నాగరాజు, అశోక్, లక్ష్మన్న, కోడుమూరు సీనియర్ జనసేన నాయకులు రాముడు, బాలు గౌడ్, చనగండ్ల మిన్నెల్లా, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించి, అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేయాలని నాయకులు ఈ సందర్భంగా నిర్ణయించారు.


# జల జీవన్ మిషన్ తో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం




**రాయచోటి, :** అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి నియోజకవర్గంలో పాటు రాయచోటి తంబళ్లపల్లె పీలేరు పుంగనూరు నియోజకవర్గాలలో జల్ జీవన్ మిషన్ పనులు చురుగ్గా సాగుతున్నాయని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ జల్ జీవన్ మిషన్ తో అన్నమయ్య జిల్లాలో తాగునీటి సమస్య ను పూర్తిగా తొలగిపోతుందని తెలియజేశారు .మదనపల్లె నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. శనివారం అన్నమయ్య జిల్లా మదనపల్లి నియోజకవర్గంలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనులను కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్ ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ పథకం కింద మదనపల్లె నియోజకవర్గానికి రూ.1,000 కోట్ల అంచనా వ్యయంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్?2 మంజూరైనట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మంజూరులో స్థానిక శాసనసభ్యులు షాజహాన్ భాషా గారు ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మదనపల్లె నియోజకవర్గంలోని మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం గ్రామీణ మండలాలతో పాటు మదనపల్లె పట్టణానికి సురక్షితమైన, నిరంతర తాగునీటి సరఫరా కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇప్పటికే వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ఫేజ్?1 కింద గండికోట రిజర్వాయర్ నుంచి గుర్రంకొండ మండలం మావిళ్లవారిపల్లె వరకు పైపులైన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మావిళ్లవారిపల్లె వద్ద నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి, అక్కడి నుంచి మదనపల్లె నియోజకవర్గంతో పాటు మదనపల్లె మున్సిపాలిటీకి తాగునీటిని సరఫరా చేయడం ద్వారా ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు పేర్కొన్నారు.వాటర్ గ్రిడ్ ఫేజ్?2కు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నామని, 18 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రాజెక్టు అమలుకు అవసరమైన వివిధ శాఖల అనుమతులను త్వరితగతిన పొందాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించామన్నారు.మదనపల్లె నియోజకవర్గ ప్రజల చిరకాల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే ఈ ప్రతిష్టాత్మక వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పూర్తయితే, ఈ ప్రాంత ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన తాగునీరు నిరంతరం అందుబాటులోకి రానుందని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు

# బద్వేల్ లోఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం

## -బద్వేలు టిడిపి ఇన్చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం



**బద్వేలు :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా అధిష్టానం ఆదేశాల మేరకు బద్వేల్ టిడిపి ఇన్చార్జి మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి టిడిపి కార్యక్రమం ఐదవ వార్డు లోని ఎగువ బ్రాహ్మణ వీధి, దిగువ బ్రాహ్మణ వీధి, దూల్లవీధి లలో పర్యటించారు. బద్వేల్ టిడిపి సీనియర్ నాయకులు మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు, కొంకుల రామకృష్ణ, శ్రీరాములు, రమణయ్య, రవికుమార్ గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారురెండేళ్ల కూటమిపాలన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల భాగంగా సోమవారం బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి 17 అవార్డు శ్రీకృష్ణదేవరాయ నగర్ లో పర్యటించారు, వారికి వార్డులో అడుగడుగున ప్రజలు బ్రహ్మరథం పలుకుతూ కోదండ రామాలయంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలు గజమాలతో పలువురు ఘనంగా సత్కరించారు అనంతరం వార్డులో పర్యటించిన సూర్యనారాయణ రెడ్డి ఇంటింటికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అన్న విషయంపై పలువురిని అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం కృష్ణ, డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్, చిన్నుపల్లె సుబ్బారెడ్డి,ఆరవ శ్రీనివాసుల్ రెడ్డి, 17వ వార్డు టిడిపి నాయకులు బసవి శ్రీనివాసులు, నరసయ్య గాజుల నరసింహులు (బాబు) జహంగీర్ భాష షేక్, మహబూబ్ బాషా, యాదవ సంఘం అధ్యక్షులు బుర్రి రాజా యాదవ్, మాచుపల్లి కృష్ణారెడ్డి కొలవలి వేణుగోపాల్, వడ్లపూడి నాగభూషణం లకిడి విజయభాస్కర్ షరీఫ్ ఆవుల నరసయ్య బ్రదర్స్,బుట్టి నరసింహారెడ్డి, మున్సిపాలిటీ వాటర్ సెక్షన్ విభాగం సూపర్వైజర్ ఆవులేటి బాబి, మామిడి శేషారెడ్డి,వెంకటేష్ మరియు పలువురు నాయకులు పాల్గొన్నారు

# ఎల్ నినో కారణంగా నీటి కొరత

విజయవాడ, : రాష్ట్రంలో రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిపూర్ణ సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. గోదావరి, కృష్ణా డెల్టాల ఇరిగేషన్ సీఈలు, ఎస్ఈలతో ఈరోజు నిర్వహించిన ఉన్నత స్థాయి టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఎల్-నినో ప్రభావం, క్లిష్టమైన నీటి కొరత దృష్ట్యా ఇరిగేషన్ శాఖలోని పైస్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు అందరి సెలవులను రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.పుష్కర కాలువ, ఏలేరు వ్యవస్థ ద్వారా తూర్పుగోదావరి, కాకినాడ, విశాఖ జిల్లాల్లో దాదాపు 55 లక్షల మందికి తాగునీరు అందించాల్సి ఉందని... అందుకే ఈ నీటిని తాగునీటికి, ఆరుతడి పంటలకే వినియోగించాలని సూచించారు. సీలేరు జలాలను గోదావరి డెల్టా ఖరీఫ్ అవసరాల కోసం వాడుతున్నామని, మెరక ప్రాంత రైతులు కూడా ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అలాగే గోదావరి ప్రధాన కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూస్తూ, పోలవరం కుడి కాలువ నీరు వృథా కాకుండా కృష్ణా డెల్టాకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఇక కృష్ణా డెల్టా పరిధిలో నాగార్జున సాగర్ నిండకుండానే వరి సాగు చేస్తే ఆ ప్రాంత రైతులు పంట నష్టపోయే ప్రమాదం ఉందని మంత్రి హెచ్చరించారు. ఈ సీజన్‌లో సాగర్‌కు నీళ్లు రాకపోతే 2027 జూన్ వరకు పులిచింతల, పట్టిసీమ నీళ్లను తాగునీటి అవసరాలకే భద్రపరచుకోవాలని స్పష్టం చేశారు. పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించేందుకు 10 జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డ్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షలో ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై ఉక్కుపాదం

హైదరాబాద్: తెలంగాణలో మాదకద్రవ్యాల మహమ్మారిని నిర్మూలించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, కళాశాలల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. కళాశాల ప్రాంగణాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా, సంబంధిత యాజమాన్యాలనే బాధ్యులను చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో యాజమాన్యాలకు అధికారాలు కల్పించడంతో పాటు, వారిని బాధ్యులను కూడా చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు గమనించేందుకు ప్రతి కళాశాలలో ఒక ప్రత్యేక విభాగాన్ని (సెల్) ఏర్పాటు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని గోప్యంగా, సులభంగా చేరవేసేందుకు విద్యాసంస్థల్లో టోల్–ఫ్రీ నంబర్లు, ప్రత్యేక క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేసే అంశాలను పరిశీలించాలని అధికారులను కోరారు. క్యాంపస్ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచేలా పటిష్ట



వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. డ్రగ్స్ బారిన పడిన వారిని గుర్తించడం, వారిని డీ–ఎడిక్షన్ కేంద్రాలకు పంపడం, తదనంతరం నేరస్తులను కఠినంగా శిక్షించడం అనే మూడంచెల వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల కేసుల్లో పదేపదే నిందితులుగా మారుతున్న వారిపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైతే మరిన్ని పటిష్టమైన నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# డిజిటల్ ఇండియా చట్టం..




ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం పెను సవాలుగా మారుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మైనర్లు లేదా చిన్న పిల్లలు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారనే ఆందోళనల నేపథ్యంలో వయస్సు ఆధారిత పరిమితులువిధించే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తోంది. ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన సూచించారు. సోషల్ మీడియా వేదికలు యువతపై చూపిస్తున్న ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా చట్టాలు చేశాయి. భారత్‌లో కూడా ఇటువంటి నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. "పిల్లల భద్రత విషయంలో మేము రాజీ పడము. సోషల్ మీడియా వాడకానికి కనీస వయస్సు ఎంత ఉండాలనే దానిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాము. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు కానీ, లోతైన చర్చలు మాత్రం జరుగుతున్నాయి" అని స్పష్టం చేశారు. చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, సైబర్ బుల్లింగ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అశ్లీల కంటెంట్ లేదా హానికరమైన గేమింగ్ యాప్‌లు పిల్లల దారి మళ్లిస్తున్నాయని తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్లు నిండిన వారు ఖాతా తెరవవచ్చని చెబుతున్నప్పటికీ, వయస్సును ధృవీకరించే బలమైన వ్యవస్థలు లేవు. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలు కూడా తప్పుడు వివరాలతో లాగిన్ అవుతున్నారు. ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త నిబంధనల వల్ల 'ఏజ్ వెరిఫికేషన్' ప్రక్రియ మరింత కఠినతరం కానుంది. అమెరికా, యూరోపియన్ దేశాల్లో కూడా సోషల్ మీడియా (సంస్థలపై కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల డేటాను ఎలా సేకరిస్తున్నాయి? వారికి ఎటువంటి కంటెంట్‌ను చూపిస్తున్నాయి? అనే దానిపై నిఘా పెరిగింది. భారత్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా చట్టం' లో భాగంగా సోషల్ మీడియా సంస్థలకు జవాబుదారీతనాన్ని పెంచాలని కేంద్రం యోచిస్తోంది. ప్రభుత్వం కేవలం నిషేధాలకే పరిమితం కాకుండా, డిజిటల్ అక్షరాస్యతను పెంచడంపై కూడా దృష్టి సారిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ అల్గారిథమ్‌లను మార్చుకోవాలని, పిల్లలకు హాని కలిగించే కంటెంట్ రాకుండా చూడాలని మంత్రి సూచించారు. ఒకవేళ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించే అవకాశం కూడా ఉంది. అయితే ఈ ప్రక్రియలో ఇంటర్నెట్ స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలగకుండా చూడటం కూడా ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. మొత్తానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. డిజిటల్ ఇండియా చట్టం భారతదేశం నుండి దాని మొత్తం చరిత్రలో వెలువడే అత్యంత ముఖ్యమైన ఐటీ చట్టం అవుతుంది మరియు రాబోయే దశాబ్దం లేదా రెండు దశాబ్దాల పాటు మొత్తం దేశం యొక్క డిజిటల్ చట్టాలను సమర్థవంతంగా నియంత్రిస్తుంది. ఈ కొత్త చట్టంతో, దేశం తన డిజిటల్ చట్టాలను భవిష్యత్తుకు అనుగుణంగా మార్చుకోవాలని మరియు వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి వీలు కల్పించాలని ఆశిస్తోంది. అదనంగా, డిజిటల్ ఇండియా చట్టం యొక్క ముసాయిదా రూపకల్పనలో అనేక మంది వాటాదారులను (పౌరులను) పాల్గొనడానికి మరియు సంప్రదించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నించింది, దీని నియమాలు మరియు చట్రం కనీసం వచ్చే దశాబ్దం పాటు దేశంలో సమగ్ర ఐటీ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చూసుకోవాలి. అయితే, అంతిమ లక్ష్యం పౌరుల గోప్యతా హక్కుల కోసం బలమైన చట్టాలను నిర్ధారించడం మరియు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంపొందించడం మాత్రమే కాదు – డిజిటల్ ఇండియా చట్టం భారతీయ వ్యాపారాలకు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి మరియు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా దేశాన్ని ప్రపంచవ్యాప్త డిజిటల్ పవర్‌హౌస్‌గా మార్చడానికి రూపొందించబడింది. డిజిటల్ ఇండియా చట్టం చుట్టూ కేంద్రీకృతమై, భారతదేశం 2026 నాటికి ట్రిలియన్ డాలర్ల డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాధించగలదని చంద్రశేఖర్ విశ్వసిస్తున్నారు. భారత పార్లమెంటు నవంబర్ 2022లో ప్రతిపాదించబడిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు, 2022 తో పాటు డిజిటల్ ఇండియా చట్టాన్ని అమలు చేయాలని యోచిస్తోంది . ఈ రెండు చట్టాలు ఒకదానికొకటి కలిసి పనిచేస్తాయి, డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు భారతదేశంలో వ్యక్తిగత డేటాను ప్రాసెస్ చేయడంపై మాత్రమే దృష్టి సారిస్తుంది. 2000 నాటి ఐటీ చట్టం చాలా కాలం చెల్లినది మరియు దాని ప్రారంభంలో "ఇంటర్నెట్" గురించి దాదాపుగా ప్రస్తావించబడలేదు. భారతదేశం ప్రపంచంలోనే అత్యధిక ఇంటర్నెట్ కనెక్షన్ ఉన్న దేశం అనే స్థాయికి చేరుకుంటున్నందున, , కానీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు మాత్రమే నిర్వచించబడిన నియమాలు ఉన్నాయి. సమాచార భాగస్వామ్యాన్ని సులభతరం చేసే లేదా ఆన్‌లైన్ సేవలను అందించే ఏదైనా కంపెనీ లేదా ప్లాట్‌ఫారమ్‌ను మధ్యవర్తులు అంటారు. ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను "స్వచ్ఛమైన మధ్యవర్తులు"గా వర్గీకరించారు మరియు కలిసి సమూహం చేశారు. మూడవ పక్షాల నుండి ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం లేదా ఇతర కంటెంట్ ఉల్లంఘనలకు సంబంధించి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" రోగనిరోధక శక్తిని తొలగించడంగతంలో, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వంటి ఆన్‌లైన్ మధ్యవర్తులకు "సేఫ్ హార్బర్" చట్టపరమైన రోగనిరోధక శక్తి ఇవ్వబడింది, వారి సంబంధిత ప్లాట్‌ఫారమ్‌లలో పోస్ట్ చేయబడిన మూడవ పక్ష కంటెంట్‌పై వారికి ఎటువంటి నియంత్రణ లేనందున వాటిని సమర్థవంతంగా రక్షించింది. అయితే, మధ్యవర్తులకు రోగనిరోధక శక్తి ఇవ్వబడినందున, వారికి మూడవ పక్ష కంటెంట్ యొక్క నియంత్రణ లేదు, ఇది తరచుగా వాస్తవ తనిఖీ లేకపోవడం మరియు కంటెంట్ ఉల్లంఘనలను తొలగించకపోవడానికి దారితీస్తుంది. డిజిటల్ ఇండియా చట్టం ప్రకారం, ప్రతి మధ్యవర్తి వర్గం కొత్త నిబంధనలకు లోబడి ఉంటుంది, డిజిటల్ ఇండియా చట్టం కింద సైబర్ బెదిరింపు, వంచన, గుర్తింపు దొంగతనం , మోసం, డాక్సింగ్ మరియు హానికరమైన అనధికార వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వంటి కొత్త రకాల సైబర్ నేరాలను కొత్త క్రిమినల్ నేరాలుగా వర్గీకరించాలని ఎలక్ట్రానిక్స్ మరియు ఐటీ మంత్రిత్వ శాఖ యోచిస్తోంది . గతంలో, ఈ నేరాలకు జరిమానాలు విధించేవారు మరియు ఐటీ చట్టం ద్వారా నేరంగా పరిగణించబడలేదు. డిజిటల్ స్థలం (బిగ్ టెక్) యొక్క గుత్తాధిపత్యాన్ని తొలగించడంమరియు స్థానిక స్టార్టప్‌ల నుండి న్యాయమైన పోటీని మరియు వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అనుమతించడం.

# రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం

తాండూరు; మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని రేచిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టీయూటీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు భట్టారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పలువురు ఉపాధ్యాయులు రాష్ట్రోపాధ్యాయ సంఘంలో సభ్యత్వం స్వీకరించి సంఘ బలోపేతానికి తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భట్టారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్రోపాధ్యాయ సంఘం గత 80 సంవత్సరాలుగా విద్యారంగ అభివృద్ధి, ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం సంఘం అనేక ఉద్యమాలు చేపట్టిందని, భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం మరింత బలంగా పోరాటం కొనసాగించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు సంఘంలో సభ్యత్వం తీసుకుని సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కొన్ని మండలాల్లో 2024 సంవత్సరం వేసవి శిక్షణ తరగతులకు సంబంధించిన సంపాదిత సెలవులు (ఈఎల్‌లు) ఇప్పటికీ మంజూరు కాకపోవడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఈఎల్‌లను ఉపాధ్యాయులకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం (డీఏ) బకాయిలను వెంటనే ప్రకటించాలని, వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నివేదికను విడుదల చేసి కొత్త వేతన సవరణను అమలు చేయాలని కోరారు. అలాగే భవిష్య నిధి (జీపీఎఫ్), నూతన పెన్షన్ విధానం (సీపీఎస్), సంపాదిత సెలవులు (ఈఎల్) తదితర పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉపాధ్యాయుల ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతను ప్రభుత్వం కాపాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రవిబాబు, కృష్ణగౌడ్, రాజేంద్రప్రసాద్, సంతోష్, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, సుకుమాంజలి తదితర ఉపాధ్యాయులు పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అరుతడి పంటలు మాత్రమే పండించాలి

సిద్దిపేట : వర్షభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అరుతడి పంటలు మాత్రమే పండించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి రైతులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో గల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విత్తన మేళాను ప్రారంభించి రైతులకు ఆరుతడి పంటల విత్తనాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురియడం లేదని, జిల్లాలో సాధారణంగా 256 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సింది ఉండగా కేవలం జిల్లాలో 176 మీ వర్షపాతం మాత్రమే పడిందని అన్నారు. జిల్లాలో అన్ని మండలాలలో లోటు వర్షపాతం ఉందని హుస్నాబాద్, వర్గల్, ములుగు మండలాల్లో తీవ్ర వర్ష భావం ఉందని అన్నారు. నారువేసే సమయానికే ఇలా ఉంటే వరి కోత సమయం వరకు వరికి నీళ్లు ఎలా అందుతుందని అన్నారు. అందుకే ప్రభుత్వం ఆరుతడి పంటలు పండించుకునే విధంగా రైతులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తుందని తెలిపారు. వరి పండిస్తే ఒక ఎకరాకి ఒక రోజుకు 25 వేల లీటర్ల మీరు అవసరమని అదే నీటితో ఆరు నుండి ఎనిమిది ఎకరాల్లో మెట్ట పంటలను పండించవచ్చని అన్నారు. ఆరుతడి పంటలు పండిస్తే ఆదాయం రావడంతో పాటు నీటివినియోగం తగ్గుద్దనీ, ఈనెల 31 వరకు మొక్కజొన్న, పెసలు, మినుములు, అలసందలు, వేరుశనగ మొదలగు పంటలను వేసుకోవచ్చని, వర్షాభావ పరిస్థితుల్లో పండే రాగులు, కందులు, పొద్దుతిరుగుడు, మిల్లెట్స్, కొర్రలు, అరికెలు, ఆముదం తదితర పందాలను ఆగస్టు 30 వరకు విత్తుకోవచ్చని అన్నారు. రైతులు భూములను ఖాళీగా వదలకుండా ఖచ్చితంగా ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. ఆయిల్ ఫామ్ వేసుకుంటే డ్రిప్, అంతరపంటలకు సబ్జిడీ లభిస్తుందని తెలిపారు. జిల్లాలో కూరగాయలు, ఆకుకూరలకు మంచి మార్కెటింగ్ ఉందని వాటిని పండించాలన్నారు. విబి జి రాంజీ, తెలంగాణ జలసిరి




పథకాల ద్వారా వర్షపు నీటిని ఒడికట్టి భూగర్భ జలాలు పెంచుకునేలా ఫామ్ పాండ్ నిర్మించుకోవాలనీ తద్వారా భూగర్భ జలాల పెంపుతో పాటు చేపల పెంపకం కు మరియు కూరగాయలు ఇతర పంటలు వేసుకోవడానికి ఉపయోగపడతాయని తెలిపారు. బోర్ వెల్స్ రీఛార్జ్ స్ట్రక్చర్స్ నిర్మించి నీరు వృధా కాకుండా భూమిలోకి ఇంకెలా చూడాలని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల రూఫ్ టాప్ నుండి వచ్చే నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని, అలాగే ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటుచేసుకోవాలన్నారు. గత రబీ సీజన్లో రికార్డు స్థాయిలో 5 లక్ష 25 మెట్రిక్ తనుల వరి ధాన్యం పండిందని ధాన్యానికి రెండు సంవత్సరాల వరకు ఇబ్బంది లేదు అని తెలిపారు. ఎలాంటి పంటలు పండించిన రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తల సలహాలు తీసుకొని మీ అనుభవాలను ఉపయోగించుకొని లాభదాయక పంటలు పండించుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మల్లయ్య, జిల్లా జిల్లా ఉద్యానవనాధికారి సువర్ణ, ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, వ్యవసాయ అధికారి, స్థానిక సర్పంచ్ చింతల శ్రీనివాస్, వివిధ శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీకేజీ మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి

## -సిపిఐ నాయకులు డిమాండ్ : మృతులకు నివాళులు




నరసరావుపేట : నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద దేశవ్యాప్త పిలుపులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో దేశవ్యాప్తంగా విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు మరియు దేశ రాజధాని ఢిల్లీ నగరంలో జంతర్ మంతర్ దగ్గర లక్షలాది మంది విద్యార్థులు నరేంద్ర మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేయడం వలన కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం మన దేశ విద్యార్థులు,యువత విజయం అని అన్నారు. ఈ విజయం బిజెపి ప్రభుత్వ అహంకారానికి పరాజయం. ప్రజాస్వామ్య పద్ధతలలో ఢిల్లీ నగరంలో విద్యార్థులు శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తుంటే బిజెపి ప్రభుత్వం ఢిల్లీ పోలీసులతో విద్యార్థులపై లాఠీచార్జి చేయించడం మరియు అక్రమ కేసులు పెట్టడాన్ని సిపిఐ ఖండిస్తుంది, వ్యతిరేకిస్తుందని వారు అన్నారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, విద్యార్థులకు ఢిల్లీ పోలీసులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ అవినీతి, కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని, విద్యా సంస్కరణలు లో భాగంగా తీసుకొచ్చిన ఎన్ ఈ పి –2020, ఎన్ టి ఏ ని రద్దు చేయాలని, విద్యలో సంస్కరణలు తీసుకొని తెచ్చేటప్పుడు విద్యావేత్తల సలహాలు తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి నేతత్వంలోని ప్రభుత్వ దుష్పరిపాలనకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేయడానికి రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి మన సంకల్పాన్ని దిశగా, రాజ్యం స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకై మరోసారి యువత నడుం బిగించే విధంగా కార్యక్రమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి సత్యనారాయణ రాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు, ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వైదన వెంకట్, ఏఐవైఎఫ్ నాయకులు రాజు, కొయ్యశీను, తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు శాఖలో కృత్రిమ మేధస్సు..

## -సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై శిక్షణ

## -పీటీసీలో కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ : ఆధునిక సాంకేతికతతో నేర నియంత్రణ, దర్యాప్తులో మరింత సామర్థ్యం పెంపే లక్ష్యంతెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దే లక్ష్యంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ పిటిసి కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పోలీసు శాఖ కూడా అదే స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధస్సు ఏఐ డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, స్మార్ట్ సర్వైలెన్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేరాల నియంత్రణ, దర్యాప్తు, ప్రజా భద్రతలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 2018, 2020 మరియు 2024 బ్యాచ్‌లకు చెందిన కానిస్టేబుళ్లకు ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడు కమిషనరేట్లు నిజామాబాదు, కరీంనగర్, సిద్దిపేట ఆరు జిల్లాలకు ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల, కామారెడ్డి, ఆసిఫాబాద్ చెందిన పోలీసు సిబ్బందికి మొత్తం 11 దశల్లో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. ప్రతి దశలో 80 మంది కానిస్టేబుళు పాల్గొంటారని, ప్రతి బ్యాచ్‌కు ఐదు రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు వివరించారు. శిక్షణలో భాగంగా ఏఐ ఆధారిత



పోలీసింగ్, డిజిటల్ సాక్ష్యాల నిర్వహణ, సైబర్ నేరాల గుర్తింపు మరియు నివారణ, స్మార్ట్ సర్వైలెన్స్ వ్యవస్థలు, దర్యాప్తులో సాంకేతిక వినియోగం, డేటా విశ్లేషణ, నైతిక విలువలు, గోప్యతా నిబంధనలు, చట్టపరమైన అంశాలపై నిపుణులచే ప్రాయోగిక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది సాంకేతికంగా మరింత నైపుణ్యం సాధించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించే విధంగా ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. తెలంగాణ పోలీసు శాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సాంకేతికంగా మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీటీసీ ప్రిన్సిపల్ అడిషనల్ ఎస్పీ ఎం. పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపల్ ఏసీపీ గంగాధర్, ఏసీపీ లు విజయపాల్ రెడ్డి, బి. నారాయణ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com